
సాక్షి
బాపట్ల

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



పోలేరమ్మ తల్లి వార్షికోత్సవం

బాపట్ల: బాపట్ల పట్టణం బావరాజుతోటలోని పోలేరమ్మ తల్లి మొదటి వార్షికోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 516.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వైభవంగా వేణుగోపాలుడి కల్యాణం

కోడూరు: హంసలదీవి వేణుగోపాలుడి కల్యాణం వైభవోపేతంగా సాగింది. ఆలయ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా స్వామివార్ల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఒత్తిడి లేకుండా చదివితే మంచి మార్కులు

రాష్ట్ర పరీక్షల విభాగం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు



అద్దంకి రూరల్: పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా కష్టపడి చదివితే మంచి మార్కులు వస్తాయని రాష్ట్ర పరీక్షల విభాగం డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాసులు అన్నారు. శనివారం సాయంత్రం చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు పరీక్షలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పాఠశాలలో జరుగుతున్న అల్పాహార కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో హెచ్ఎం కేవీ శ్రీనివాసరావు ఉపాధ్యాయులు కె.వీరాంజనేయులు, అంకారావు, కె.జయలక్ష్మి పాల్గొన్నారు.

పాతకాపుల వైపే మొగ్గు

తెనాలిలో ఆలపాటి రాజా వర్గం..సత్తెనపల్లిలో కోడెల శివరాం వర్గం గరం..గరం

- తన సామాజికవర్గానికే పెద్దపీట
- గుంటూరుపై తేల్చని వైనం
- తాడికొండలో శ్రీదేవికి మొండిచెయ్యి
- పల్నాడులో మూడు సీట్లు పెండింగ్
- టీడీపీ–జనసేన జాబితాపై ఆందోళన వ్యక్తంచేస్తున్న కేడర్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెలుగుదేశం–జనసేన సీట్ల ప్రకటన కొత్త సీసాలో పాతనీరులా ఉందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అసలు ప్రయోగాలు చేయడానికే భయపడ్డట్టు కనపడుతోంది. ఒకటి రెండు సీట్లు మినహాయిస్తే అన్ని సీట్లు గత ఎన్నికల్లో పోటీ చేసిన వారికే కేటాయించడం గమనార్హం. గుంటూరు తూర్పు, పశ్చిమలో మైనారిటీ, బీసీ మహిళలు నూరి ఫాతిమా, విడదల రజినీలకు వైఎస్సార్ సీపీ టికెట్‌లు కేటాయించడంతో అక్కడ కొత్త అభ్యర్థుల వేటలో తెలుగుదేశం ఉంది. దీంతో ఆ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. తనకు సీటు లేదని తేలడంతో గోడ దూకిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి తెలుగుదేశం పార్టీ మొండిచెయ్యి చూపించింది. టికెట్ ఇస్తామన్న హామీ ఇవ్వడంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశానికి ఓటు వేయడమే కాకుండా అమరావతి ఉద్యమంలో పాల్గొనడం, చంద్రబాబు, లోకేష్‌లను పొగడ్తలతో ముంచెత్తుతున్న శ్రీదేవికి ఈ టికెట్ల ప్రకటన షాక్ ఇచ్చింది. నమ్ముకుని వచ్చిన వారిని నట్టేట ముంచుతాడన్న వాదనకు చంద్రబాబు నిర్ణయం బలాన్ని ఇచ్చింది. తాడికొండ సీటుగాని, కృష్ణాజిల్లా తిరువూరు సీటుగాని కేటాయించాలంటూ చంద్రబాబు, లోకేష్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోలేదు. తిరువూరు సీటును అమరావతి ఉద్యమంలో పనిచేసిన కొలికపూడి శ్రీనివాస్‌కు కేటాయించారు. తాడికొండ సీటును గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్‌కు ప్రకటించారు. గుంటూరు జిల్లాలో ప్రకటించిన వాటిలో మూడు సీట్లు కూడా పాతవారికే కేటాయించారు. మంగళగిరి లోకేష్, పొన్నూరు నరేంద్ర, తాడికొండ శ్రావణ్‌కుమార్, ప్రత్తిపాడు సీటును బూర్ల రామాంజనేయులుకు కేటాయించగా తెనాలి సీటును జనసేన తరఫున నాదెండ్ల మనోహర్‌కు కేటాయించారు. బాపట్ల జిల్లాలో రేపల్లె సిట్టింగ్ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, బాపట్ల వేగ్నేశన నరేంద్రవర్మ, వేమూరు మాజీ మంత్రి నక్కా ఆనందబాబుకు కేటాయించారు. పల్నాడు జిల్లాలో వినుకొండ జీవీ ఆంజనేయులు, సత్తెనపల్లి కన్నా లక్ష్మీనారాయణ, చిలకలూరిపేట ప్రత్తిపాటి పుల్లారావు, మాచర్ల జూలకంటి బ్రహ్మారెడ్డికి కేటాయించారు. గురజాలలో యరపతినేని శ్రీనివాసరావుకు టికెట్ ఇవ్వకుండా ఆపారు. పెదకూరపాడు కొమ్మాలపాటి శ్రీధర్, బాష్యం ప్రవీణ్ మధ్య పోటీ నెలకొనడంతో దాన్ని కూడా పెండింగ్ పెట్టారు. లావు శ్రీకృష్ణదేవరాయలు తనతోపాటు జంగా కృష్ణమూర్తికి సీటు ఇవ్వాలని పట్టుపడుతుండటంతో గురజాల, నరసరావుపేట సీట్లను పెండింగ్‌లో పెట్టినట్లు చెబుతున్నారు. అభ్యర్థుల ప్రకటనతో తెనాలిలో ఆలపాటి రాజా వర్గం, సత్తెనపల్లిలో కోడెల శివరామ్ వర్గం ఆగ్రహంతో ఉన్నాయి.



నిమ్మకాయల ధరలు

గుంటూరు: జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5600, గరిష్ట ధర రూ.7300, మోడల్ ధర రూ.6300 వరకు పలికింది.

టీడీపీలో అసమ్మతి సెగలు

బాపట్ల జిల్లాలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ప్రకటనపై నిరసన సెగలు రాజుకున్నాయి. టీడీపీ అధిష్టానం శనివారం పలు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన విషయం విదితమే. టికెట్ రాని ఆశావహులతోపాటు వారి అనుచరగణం పార్టీ అధిష్టానంపై తిరుగుబాటు జెండా ఎగురవేస్తున్నారు. మరికొన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించకపోవడంతో అక్కడి నాయకుల్లో ఆందోళన నెలకొంది. తమకు టికెట్ వస్తుందో రాదో తెలియక అయోమయంలో ఉన్నారు. టికెట్ రాకపోతే తిరుగుబాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

- బాపట్ల జిల్లాలో ఐదు స్థానాలకు అభ్యర్థుల ఖరారు
- చీరాల అభ్యర్థిని ప్రకటించని అధిష్టానం
- బాపట్ల స్థానం నరేంద్రవర్మకు కేటాయింపు
- బీజేపీ కోటాలో టికెట్ కోసం ఎదురు చూసిన అన్నం సతీష్‌ప్రభాకర్
- వర్మకు వ్యతిరేకంగా పనిచేసే అవకాశం
- టికెట్ ఖరారు కాకపోవడంతో ఆందోళనలో కొండయ్య వర్గం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లాలో చీరాల మినహా మిగిలిన ఐదు అసెంబ్లీ స్థానాలకు టీడీపీ అభ్యర్థులను ప్రకటించింది. రేపల్లెకు అనగాని సత్యప్రసాద్, వేమూరుకు నక్కా ఆనందబాబు, బాపట్లకు వేగేశన నరేంద్రవర్మ, అద్దంకి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఏలూరి సాంబశివరావులను అభ్యర్థులుగా ఎంపిక చేశారు. చీరాల అభ్యర్థిని ప్రకటించలేదు.

అయోమయంలో కొండయ్య

ఇటీవల కాలంలో చీరాల టీడీపీ అభ్యర్థి మార్పు ఉంటుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. తాజాగా ప్రకటించిన జాబితాలో చీరాల అభ్యర్థిని ప్రకటించకపోవడంతో ఆ ప్రచారానికి ఊతమిచ్చింది. చీరాలకు రాబోయే జాబితాలో కొత్త అభ్యర్థి రావడం ఖాయమని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకూ చీరాల టీడీపీ ఇన్‌చార్జిగా యాదవ సామాజికవర్గానికి చెందిన ఎంఎం కొండయ్య ఉన్నారు. రెండేళ్లుగా ఎంఎం కొండయ్య పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆర్థికంగానూ నష్టపోయారు. ఇదే సమయంలో చీరాల అభ్యర్థిని మార్చాలని టీడీపీ అధిష్టానం ముఖ్యంగా లోకేశ్ నిర్ణయించినట్లు ప్రచారం సాగుతోంది. చీరాల నియోజకవర్గంలో పద్మశాలీలు, దేవాంగులు కలిపి 60 వేలకు పైగా ఓటర్లు ఉన్నారని, చేనేతలు అధికంగా ఉన్న మంగళగిరిలో లోకేశ్ పోటీ చేస్తున్నందున అక్కడ చేనేతల మద్దతు తీసుకొని చీరాల టికెట్ చేనేతలకు ఇవ్వాలన్న ప్రతిపాదనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు చీరాల టికెట్ ఎంఎం కొండయ్యకు కాకుండా వేరొకరికి ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారు. టీడీపీ తరఫున కొత్త అభ్యర్థిని నిలుపుతారా? లేక పొత్తులో భాగంగా జనసేన అభ్యర్థిని ఎంపిక చేస్తారా? అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది. మొత్తంగా చీరాల టికెట్ కొండయ్యకు కాకుండా వేరొకరికి ఇస్తారన్న ప్రచారం ఊపందుకుంది. దీంతో ఎంఎం కొండయ్య, ఆయన అనుచరులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇన్నాళ్లూ పార్టీని నడిపిన కొండయ్యను కాదని వేరొకరికి టికెట్ ఎలా ఇస్తారని ఆయన అనుచరులు ప్రశ్నిస్తున్నారు. కాదూ కూడదని కొండయ్యను తప్పిస్తే ఆయన అనుచరులతోపాటు యాదవ సామాజికవర్గం పచ్చపార్టీకి దూరమయ్యే అవకాశం ఉంది.

వర్మ వ్యతిరేక వర్గంలో అసంతృప్తి

బాపట్ల టీడీపీ అభ్యర్థిగా వేగేశన నరేంద్రవర్మను ఎంపిక చేశారు. దీనిపట్ల వర్మ వ్యతిరేక వర్గం అసంతృప్తితో రగిలిపోతోంది. మరోవైపు బీజేపీ కోటాలో టికెట్ కోసం ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ తీవ్రంగా ప్రయత్నించారు. వర్మ, అన్నం సతీష్‌కు మధ్య విభేదాలు ఉన్నాయి. గత రెండు ఎన్నికల్లో బాపట్ల టీడీపీ అభ్యర్థిగా అన్నం సతీష్‌ప్రభాకర్ పోటీ చేయగా వర్మ ఆయనకు వ్యతిరేకంగా పనిచేశారు. తన ఓటమికి కారణమయ్యారని సతీష్ వర్గం ఆరోపణ. దీంతో వర్మపై సతీష్ వర్గం ఆగ్రహంతో ఉంది. ఎన్నికల తర్వాత సతీష్ టీడీపీని వదలి బీజేపీలో చేరారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీచేయాలని టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. బీజేపీ అధిష్టానం టీడీపీ, జనసేనతో పొత్తు వ్యవహారాన్ని ఎటూ తేల్చలేదు. అసలు పొత్తుకు వెళుతుందో లేదో తెలియని పరిస్థితి. తాజాగా టీడీపీ నరేంద్రవర్మకు బాపట్ల టికెట్ ఖరారు చేయడంతో సతీష్‌కు టికెట్ లభించే అవకాశాలు లేనట్లే. ఈ పరిస్థితిలో వర్మ టీడీపీ అభ్యర్థిగా పోటీలో ఉంటే సతీష్ వర్గం ఆయనకు మద్దతు పలికే పరిస్థితి కనిపించటంలేదు.

‘సిద్ధం’ సభకు స్థలం పరిశీలన

- ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు
- ఎంపీ విజయసాయిరెడ్డి, సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలో మార్చి 3వ తేదీన నిర్వహించే ‘సిద్ధం’ సభకు కావాల్సిన స్థలాన్ని రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పరిశీలించారు. శనివారం మండలంలోని పీ.గుడిపాడు గ్రామానికి చెందిన జాతీయ రహదారి పక్కన ఉన్న పొలాలను అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి, విజయసాయిరెడ్డి పరిశీలించారు. చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో నిర్వహిస్తున్న సిద్ధం సభలకు లక్షలాది మంది ప్రజలు హాజరవుతున్నారని చెప్పారు. సభకు ముఖ్య అతిథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. అందుకుగాను సభకు స్థలాన్ని పరిశీలించామన్నారు. సభకు లక్షల మంది ప్రజానీకం హాజరవుతున్నారని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకుగాను సభ నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కొరిశపాడు మండలంలో 16వ నెంబరు జాతీయ రహదారి పక్కన ఉన్న పీ.గుడిపాడు గ్రామానికి చెందిన రైతుల పొలాలను పరిశీలించామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ టీ.వెంకట రమణ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు జంపు హరిబాబు, ఏఎంసీ చైర్మన్ జజ్జర ఆనందరావు ఈశ్వరమ్మ, తిమ్మనపాలెం, రావినూతల సొసైటీ అధ్యక్షుడు పోతుల వెంకటస్వామి, కారుసాల బసవేశ్వరరావు సర్పంచ్ నేరెళ్ల సుబ్బయ్య, రావూరి సుందరబాబు, ముత్తవరపు రమణయ్య, అన్నెం అంజిరెడ్డి, కరణం సుబ్బయ్య, నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



సిద్ధం సభ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

క్లుప్తంగా

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శనివారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్లాక్ స్పాట్స్, యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాల వద్ద విధులు నిర్వహిస్తూ వాహనచోదకులకు రోడ్డు భద్రత, రక్షణ, అతివేగం వంటి విషయాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, పరిమితికి మించిన వేగంతో వెళ్లరాదని, తప్పనిసరిగా ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రజల రక్షణ కోసం రోడ్డు భద్రతా నియమాలు సూచించడం జరిగిందన్నారు. తొందరగా గమ్యస్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో వాహన చోదకులు రోడ్డు భద్రత నియమాలు పాటించకుండా పరిమితికి మించిన వేగంతో వాహనాలను నడపడం వలన వేగాన్ని నియంత్రించలేక రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ టోర్నమెంట్‌కు చినగంజాం క్రీడాకారులు


ఆట్ల అశోక్‌రెడ్డి


ఆట్ల అభిలాష్ రెడ్డి


బోగిరెడ్డి భవానీ శంకర్‌రెడ్డి

చినగంజాం: జాతీయ కబడ్డీ టోర్నమెంట్ రాష్ట్ర జట్టుకు ప్రకాశం జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా కోచ్ సీహెచ్ పుల్లయ్య తెలిపారు. ఈనెల 21 నుంచి 23 వరకు సత్తెనపల్లిలో నిర్వహించిన 33వ సబ్ జూనియర్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరచిన ఆట్ల అశోక్‌రెడ్డి, ఆట్ల అభిలాష్ రెడ్డి, బోగిరెడ్డి భవాని శంకర్ రెడ్డిలు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన ముగ్గురు క్రీడాకారులు మార్చి 18 నుంచి 21 వరకు బిహార్‌లో జరిగే జాతీయ కబడ్డీ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టులో ఆడతారని ఆయన తెలిపారు. వీరు ముగ్గురూ చినగంజాం మండలం మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన వారు కావడం విశేషం. వీరికి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఆమంచి వెంకటేశ్వరరావు, పోలకం రామచంద్రరావు, తుమ్మలపెంట పద్మారావు, కోటేశ్వరరావు, నంగు శ్రీనివాస రెడ్డి, స్వామిరెడ్డిలు అభినందనలు తెలిపారు.

నేడు గ్రూప్–2 పరీక్షలు

- పరీక్షలకు పటిష్ట బందోబస్తు
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్లటౌన్: గ్రూప్–2 స్క్రీనింగ్ టెస్ట్ పరీక్షలకు సంబంధించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 25 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 7671 మంది అభ్యర్థులు గ్రూప్–2 పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. డీఎస్పీ స్థాయి అధికారులు ముగ్గురు, 12 మంది సీఐలు, 25 మంది ఎస్ఐలు మొత్తం 224 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించనున్నారన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదైనా ఒరిజినల్ ఐడీ కార్డుతో ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. పరీక్ష పూర్తయ్యేంతవరకు కేంద్రం నుంచి అభ్యర్థులు బయటకు వెళ్లేందుకు అనుమతించబడదన్నారు. సెల్‌ఫోన్‌లు, క్యాలిక్యులేటర్లు, బ్లూటూత్, స్మార్ట్ వాచీలు ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు పరీక్ష కేంద్రాలలోకి అనుమతించబడవన్నారు. అభ్యర్థులు మాల్ ప్రాక్టీస్, చెడు ప్రవర్తనకు పాల్పడితే ఏపీ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టీస్ అండ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్, 1997 చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున, ప్రజలు గుమికూడడం నిషేధమని, జిరాక్స్, ఇంటర్నెట్ షాపులు మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా డయల్ 100, 112 బాపట్ల ఎస్పీ హెల్ప్‌లైన్ నంబర్ 8333813228కు కాల్ చెయ్యాలన్నారు.


గీతం జూనియర్ కళాశాలలో తరగతి గదులను పరిశీలిస్తున్న లైజన్ అధికారి ఎ.శ్రీశిల్ప

మండలంలో ఐదు కేంద్రాల్లో హాజరుకానున్న 1400 మంది

చెరుకుపల్లి: ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షలకు ఆయా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు రూట్ ఆఫీసర్లు పి.సురేష్, అబుల్ విలియం శనివారం తెలిపారు. మండలంలో ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షలకు ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అందులో పొన్నపల్లిలోని గీతం జూనియర్ కళాశాలలో 450 మంది, శివాని డిగ్రీ కళాశాలలో 250 మంది, కనగాల హెచ్‌ఎంకేఎస్ బీఈడీ కళాశాలలో 250 మంది, కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 200 మంది గుళ్లపల్లి ఎస్‌ఆర్‌ఐ కళాశాలలో 250 మంది, మొత్తం 1400 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఇప్పటికే అన్ని కళాశాలల్లో లైజన్ ఆఫీసర్ల పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా గీతం జూనియర్ కళాశాలలో లైజన్ అధికారి ఎ.శ్రీశిల్ప మాట్లాడుతూ పరీక్ష ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి 1 గంటవరకు జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఉదయం 9.30గంటల కల్లా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షకు వచ్చేవారు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడిద్దాం

- పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ
- పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం
- సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకారం


పర్చూరు సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరిస్తున్న బాలాజీ

పర్చూరు (చినగంజాం): నియోజకవర్గంలో ఎటువంటి వర్గ విబేధాలకు తావులేకుండా అందరూ ఐక్యంగా ఉండి రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ జెండాను రెపరెపలాడిద్దామని పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ అన్నారు. నియోజకవర్గ కేంద్రం పర్చూరులో పార్టీ కార్యాలయాన్ని శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. పురోహితుల వేద మంత్రాల మధ్య ఆయన సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించారు. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ మండల కన్వీనర్ కఠారి అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎటువంటి వర్గాలు లేవని, అది ఒకటే వర్గమని అందరిదీ జగన్‌మోహన్‌రెడ్డి వర్గమన్నారు. నాయకులు, కార్యకర్తలతో సమన్వయ పరచుకుంటూ ఎటువంటి విమర్శలకు తావులేకుండా చూస్తానని, తాను 24 గంటలు అందుబాటులో ఉంటానన్నారు.

అక్రమ దందాలు.. వసూళ్లకు పాల్పడితే చర్యలు..

అక్రమ మైనింగ్, ఇసుక అక్రమ రవాణ, అక్రమ దందాలు, అక్రమ వసూళ్లు నిలువరించడమేకాక దానికి బాధ్యులైన వ్యక్తులు, అధికారులపై ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇకనుంచి నియోజకవర్గంలో ఎటువంటి అక్రమ టోల్ ఫీజులు, బలవంతపు వసూళ్లకు తావులేదని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ ఆయా మండలాల కన్వీనర్‌లు బండారు ప్రభాకరరావు, మున్నం నాగేశ్వరరెడ్డి, దండా చౌదరి, పఠాన్ కాలేషవలి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి మాచవరపు రవికుమార్, ఆరు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, జేసీఎస్ కన్వీనర్‌లు, గృహ సారథులు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుట్రలు, కుతంత్రాలకు కాలం చెల్లింది

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- తంగేడుమిల్లిలో 'పల్లెపల్లెకు హనిమిరెడ్డి అన్న'

అద్దంకి (సంతమాగులూరు): స్థానిక ఎమ్మెల్యే కుట్రలు, కుతంత్రాలు, మాయలకు కాలం చెల్లిందని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం రాత్రి సంతమాగులూరు మండలంలోని తంగేడుమిల్లిలో 'పల్లెపల్లెకు హనిమిరెడ్డి అన్న' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. మార్చి 3వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేదరమెట్లలో జరిగే సిద్ధం సభలో పాల్గొంటున్నందున అత్యధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే తాను గెలవలేననే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ నాయకులను తన వైపు తిప్పుకోవాలని ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అద్దంకి నియోజకవర్గ ప్రజలు ఇక కొందరు నాయకులు చెప్పే మోసపూరిత మాటలు నమ్మరన్నారు. ఆ కాలం ఎప్పుడో పోయిందన్నారు. 24 గంటలు గడవక ముందే ఆయన నైజం తెలుసుకుని వారు మళ్లీ సొంత గూటికి చేరారని చెప్పారు. రాబోయే కాలంలో టీడీపీ ఖాళీ అవుతుందన్నారు.


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి


పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న చిన హనిమిరెడ్డి

స్వచ్ఛందంగా వచ్చి చేరుతున్నారు..

ఇప్పటివరకూ ఎవరినీ తాము పిలవలేదని సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వారే పార్టీలో చేరుతున్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. ఎక్కడో ఒకచోట తమ వైపునకు ఎవరో అసంతృప్తి నేతలు ఒకరో ఇద్దరో వస్తే అది బలం అనుకుంటే మునిగిపోయేది ఎవరో తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అద్దంకిని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్నిప్రారంభించారు. జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, మండల కన్వీనర్ చింతా రామారావు, ఇప్పట ముసలారెడ్డి, బొల్లినేని రామకృష్ణ, గ్రామ నాయకులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు భయపెట్టి తీసుకెళ్లారు

- సొంతగూటికి చేరిన అద్దంకి మున్సిపాలిటీ వైస్ చైర్మన్
- వైవీ భద్రారెడ్డి సమక్షంలో తిరిగి వైఎస్సార్ సీపీలో చేరిక

అద్దంకి రూరల్: గత రెండు రోజుల క్రితం పార్టీని వీడి టీడీపీ కండువా కప్పుకున్న అద్దంకి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దేశుపద్మేష్ తిరిగి శనివారం రాత్రి ఒంగోలు మాజీ మార్కెట్ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి వచ్చారు. భద్రారెడ్డి పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. అనంతరం అద్దంకి చేరుకుని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా దేశు పద్మేష్ మాట్లాడుతూ తనను టీడీపీ నాయకులు ప్రలోభాలకు గురిచేసి, భయపెట్టి టీడీపీ కార్యాలయానికి తీసుకెళ్లి బలవంతంగా కండువా కప్పి మీడియాల్లో ప్రచారం చేశారన్నారు. తిరిగి సొంత పార్టీలోకి రావటం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఎవరు ప్రలోభాలకు గురిచేసినా పార్టీని వీడనన్నారు. వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి నాయకత్వంలో పనిచేస్తానన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బీవీ కృష్ణారెడ్డి, అద్దంకి పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.


పార్టీ కండువా కప్పుతున్న వైవీ భద్రారెడ్డి

ఆరోగ్య ప్రదాత సీఎం వైఎస్ జగన్

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, సమన్వయకర్త వెంకటేష్
- చీరాలలో అర్బన్ హెల్త్‌కేర్ సెంటర్ ప్రారంభం

చీరాల రూరల్: ప్రజల ఆరోగ్యమే శ్రీరామరక్షగా భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పి ఆరోగ్య ప్రదాతగా చిరస్థాయిగా నిలిచారని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. శనివారం రాత్రి స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద రూ.1.20 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరణం మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న జాగ్రత్తలు మరే రాష్ట్రంలో అమలులో లేవన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ పథకం చారిత్రాత్మకమన్నారు. చీరాలలో ఏర్పాటు చేసిన మూడో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాపారాజుతోట ప్రాంతంలోని నివాసులందరికి మెరుగైన ఆరోగ్య సేవలు అందుతాయని చెప్పారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తాం..

కరణం వెంకటేష్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికలలో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ ఒక సైనికుల్లా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రాన్ని ఎంతో నాణ్యతా ప్రమాణాలతో నిర్మించిన కౌన్సిలర్ కీర్తి వెంకట్రావును ఆయన అభినందించారు. మున్సిపల్ కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైఎస్ చైర్మన్లు బొనిగల జైసన్‌బాబు, శిఖాకొల్లి రామ సుబ్బులు, మున్సిపల్ కౌన్సిలర్లు బత్తుల అనిల్, కంపా అరుణ్ కుమార్, గొట్టిపాటి ఎబినేజర్, అర్బన్ ఫైనాన్స్ రాష్ట్ర డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కరణం బలరాం, వెంకటేష్

ఫుడ్ కోర్టుల్లో విజిలెన్స్ తనిఖీలు

నగరంపాలెం: గృహావసరాల సబ్సిడీ గ్యాస్ సిలెండర్లను వ్యాపారులకు వినియోగించే ఇరువురిపై విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ / ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగపు జిల్లా ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో విజిలెన్స్, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు సంయుక్తంగా శనివారం కాకాని రోడ్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో తొమ్మిది డొమెస్టిక్ సిలెండర్లను స్వాధీనం చేసుకున్నారు.. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ ఎస్.శ్రీనివాసల రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.